

ఎరువుల కోసం పడిగాపులు



ఉదయమే పీఏసీఎస్ కార్యాలయంకు చేరుకున్న మహిళా రైతులు

సిర్పూర్(టి), జూలై 8: మండల కేంద్రంలోని సహకారసంఘానికి ఎరువుల కోసం రైతులు ఉదయం 7గంటలకే వచ్చి కూర్చుంటున్నారు. ఒక్కొక్క రైతు పదినుంచి ఇరవై యూరియా బస్తాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. దీంతో సహకార బ్యాంకు సిబ్బంది వచ్చి స్టాక్‌ప్రకారం అందరికీ సరిపడేలా వారి ఆధార్‌కార్డు, పట్టాపాసుపుస్తకంతో బయోమెట్రిక్‌విధానం ద్వారా రెండు, మూడుబస్తాలు ఇస్తున్నారు. దీంతో ఎక్కువభూమి ఉన్న రైతులు ఇవి సరిపో వడం లేదని పేర్కొంటున్నారు. ఈవిషయంపై వ్యవసాయాధికారి మధుల తను వివరణ కోరగా తాము రోజుకు నాలుగైదు లారీల ఇండెంట్ పెడుతు న్నామని లారీలు ఆలస్యంగా రావడంతో ఈ సమస్య వస్తోందన్నారు. ఇక నుంచి రైతులకు సరిపడ యూరియా బస్తాలు సరఫరా అయ్యేవిధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

ఆర్టీసీ బస్సుల్లో పెరిగిన రద్దీ

- మహాలక్ష్మి పథకంతో ప్రయాణికుల తాకిడి
- స్థాయికి మించి ప్రయాణాలు
- అదనంగా బస్సులు నడిపించాలని డిమాండ్
- పట్టించుకోని అధికారులు

మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ముఖ్యంగా మహిళలు ప్రయాణానికి ఆర్టీసీ బస్సులకే ప్రాధాన్యం ఇస్తున్నారు. మగవారు తప్పనిసరి పరిస్థితుల్లో ప్రమాదకరగా ఫుట్‌బోర్డు ప్రయాణాలు చేయాల్సి వస్తోంది. రద్దీగా ఉండే రూట్లలో అదనపు బస్సులను నడిపించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



కాగజ్‌నగర్, జూలై 8: ప్రభుత్వం గతేడాది డిసెంబరు 9 మహాలక్ష్మి పథకం ప్రవేశపెట్టిన విష యం తెలిసిందే. ఈ పథకంతో ఆర్టీసీకి ఒక్కసా రిగా పూర్వవైభవం వచ్చినట్లయింది. మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించటంతో బస్సులు నిత్యం రద్దీగా ఉంటున్నాయి. ప్రస్తుతం ఆర్టీసీ బస్సుల్లో కిక్కిరిసి ప్రయాణాలు చేయాల్సిన పరి స్థితి ఏర్పడింది. వాస్తవంగా ఆర్టీసీ బస్సు సామర్థ్యం 58 సీట్లకు పరిమితి ఉండ గా, ప్రస్తుతం అంతకు మించి ప్ర యాణాలు సాగిస్తున్నారు. దీంతో ఎప్పుడు ఏం ప్రమాదం జరుగు తోందనని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు.

ప్రయాణికుల భద్రతేది..

జిల్లాలో ఆసిఫాబాద్ బస్సు డిపో ద్వారా వివిధ రూట్లలో బస్సులు ప్రయా ణికులను గమ్య స్థానానికి చేర్చుతున్నా యి. ముఖ్యంగా సిర్పూరు నుంచి కౌటా ల, చింతలమానేపల్లి, దహెగాం రూట్ల లో వెళ్లే పల్లెవెలుగు బస్సుల్లో రద్దీ అధికంగా ఉంటోంది. ఒక్కొక్క బస్సులో స్థాయికి మించి ప్రయాణికులు వెళుతు న్నారు. అలాగే ఫుట్ బోర్డు ప్రయాణాలు చేస్తు న్నారు. ఒకవైపు రద్దీ అధికంగా ఉండటంతో అధి కారులు కూడా చేసేదీ ఏమీ లేక బస్సుల్లోకి అనుమతిస్తున్నారు.

కాగజ్‌నగర్ నుంచి కౌటాల మీదుగా ప్రయా ణాలు చేసేందుకు పలుచోట్ల రోడ్డు సౌకర్యం బాగా లేదు. అలాగే ఆర్టీసీ బస్సులు కూడా ఏ మాత్రం కండీషన్‌లో లేవని ప్రయాణికులు పేర్కొంటు న్నారు. ఆదాయం కోసం చూడకుండా ప్రయాణి కుల భద్రతను దృష్టిలోపెట్టుకొని ఆసిఫాబాద్, సిర్పూరు నియోజకవర్గాల్లో రద్దీ ఉండేమార్గాలను ముందస్తుగా గుర్తించి ఈ మార్గా ల్లో అదనపు ట్రిప్‌ల ద్వారా బస్సులను నడిపించాలని అంతా డిమాండు చేస్తున్నారు. ట్రిప్‌లు పెంచకుండా ఉన్న బస్సుల ద్వారానే ప్రయాణాలు చేస్తే ముందస్తు చర్యలు తీసుకోవాలని అంతా కోరుతున్నారు. సామర్థ్యం కంటే అధికంగా ప్రయాణిలకులను తీసుకెళ్తే ప్రమాదాలు జరిగితే బాధ్యులెవరని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి బస్సుల్లో స్థాయికి మించి ప్రయాణాలు పూర్తిగా తగ్గించాలని, అదనంగా బస్సులను నడిపిం చాలని అంతా కోరుతున్నారు.



కాగజ్‌నగర్-బెజ్జూరుకు వెళ్లే బస్సులో ..



ఫుట్‌బోర్డు ప్రయాణాలు

అన్ని చర్యలు తీసుకుంటాం..

విశ్వనాథ్, ఆర్టీసీ డీఎం, ఆసిఫాబాద్

ఆర్టీసీ బస్సుల్లో ఫుట్ బోర్డు ప్రయాణం చేయ కుండా చూసుకోవాలని కండక్టర్‌కు సూచిస్తున్నాం. అలాగే కాగజ్‌నగర్-బెజ్జూరు, కాగజ్‌నగర్-పెంచికల్ పేట ప్రాంతాలకు రద్దీ అధికంగా ఉంటుంది. ఈ రూట్లో అదనంగా బస్సులు వేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. బస్సు సామర్థ్యం మించి ప్రయాణీకులు వెళ్లకుండా చర్యలు తీసుకుంటాం.

అథ్లెటిక్స్ క్రీడాకారులకు సన్మానం



ఆనంద్‌రావు, శకుంతలను సన్మానిస్తున్న ఏఎస్పీ ప్రభాకర్‌రావు

ఆసిఫాబాద్, జూలై 8: ఆసిఫాబాద్ మండలంలోని బూర్గుడ గ్రామానికి చెందిన అథ్లెటిక్స్ క్రీడాకారుల దంపతులు వైరాగాడే ఆనంద్ రావు, శకుంతలను సోమవారం జిల్లా పోలీసు కార్యాల యంలో ఏఎస్పీ ప్రభాకర్‌రావు ఘనంగా సన్మానించారు. జూన్5నుంచి 7వరకు ఉత్తరప్రదేశ్ లోని అయోధ్య పట్టణంలో జరిగిన అయిదు కిలోమీటర్ల వాకింగ్ ఇంటర్నేషనల్ మాస్టర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ ఈవెంట్‌లో శకుంతల ద్వితీయస్థానంలో, ఆనందరావు 5వస్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా వారిని ఏఎస్పీ సత్కరించి జిల్లాకు చెందిన క్రీడాకారులు ఈ ఘనత సాధిం చడం గొప్ప విషయమన్నారు.

ఇండ్ల స్థలాలు మంజూరు చేయాలి

జైనూర్, జూలై 8: కొద్దిసంవత్సరాల నుంచి ఏజెన్సీప్రాంతంలో పాత్రికే యులుగా గ్రామీణప్రాంత ప్రజలకు సేవలు అందిస్తున్నామని తమకు ఇళ్ల స్థలాలు, అక్రిడేషన్ కమిటీలో చోటు కల్పించాలని కోరుతూ సోమవారం కలె క్టర్ వెంకటేష్ దోత్రేకు మండల పాత్రికేయులు వినతిపత్రం అందజేశారు. జిల్లావ్యాప్తంగా 40మంది గిరిజన జర్నలిస్టులు వివిధ మండలలో పనిచేస్తున్న ప్పటికీ ఇప్పటి వరకు ఇండ్ల స్థలాలు మంజూరు కాలేదన్నారు. అంతకుముందు జర్నలిస్టులు డీపీఆర్వో సంపత్‌కుమార్‌ను సన్మానించారు. కార్యక్రమంలో జర్నలిస్టులు రామేశ్వర్, రాము, సుదం, గేడందత్త, భీంరావు, తదితరులున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

లింగాపూర్, జూలై 8: మండలంలో నాలుగు స్త్రీ శక్తి కేంద్రాల నిర్వహణకు మండలంలోని మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని లింగాపూర్ ఐకేపీ ఏపీఎం దేవానందం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునే మహిళలు లొద్దిగూడ, మామిడిపల్లి, లింగాపూర్, చోర్‌పల్లి, గ్రామపంచాయతీలకు చెందిన వారై స్వయంసహాయక సంఘంలో సభ్యురాలై ఉండి ఇంటర్ మీడి యట్ పాసై ఉండాలన్నారు. పూర్తిచేసిన దరఖాస్తులు ఈనెల 12వ తేదీ సాయంత్రం 5గంటల్లోపు లింగాపూర్ మండలకేంద్రంలో గల ఐకేపీ కార్యాలయంలో సమర్పించాలని అన్నారు.

విదేశీ ఉన్నత విద్య కోసం దరఖాస్తుల స్వీకరణ

ఆసిఫాబాద్, జూలై 8: విద్యాసంవత్సరం(2024-25)కి గాను మైనార్టీ సంక్షేమశాఖ ద్వారా విదేశీవిద్య పథకం కింద దరఖాస్తులు స్వీకరిస్తున్నామని జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి ఆర్ రమాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీలో 60శాతం మార్కులు ఉండి పోస్టు గ్రాడ్యుయేషన్ చేసేందుకు, పోస్టు గ్రాడ్యుయేషన్‌లో 60శాతంమార్కులు ఉంది పీహెచ్‌డీ చేయాలనుకునే వారు మాత్రమే అర్హులన్నారు.ఆగస్టు7లోగా www.telanganaepass. cgg.gov.in లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

టికెట్‌లో పది శాతం రాయితీ

ఆసిఫాబాద్‌రూరల్, జూలై 8: ఆర్టీసీబస్సుల్లో ఆసిఫాబాద్‌నుంచి హైదరా బాద్ సూపర్‌లగ్జరీ, లహరి సర్వీసులకు ఒకటేసారి పోసురాను టికెట్ బుక్ చేసుకుంటే తిరుగు ప్రయాణంలో పదిశాతం రాయితీ సౌకర్యం పొందవచ్చని డిపోమేనేజర్ విశ్వనాథ్ తెలిపారు. ఈఅవకాశాన్ని ప్రయాణికులు సద్విని యోగం చేసుకోవాలన్నారు.

విధి నిర్వహణలో మద్యం సేవిస్తే ఉపేక్షించేది లేదు

ఆసిఫాబాద్‌రూరల్, జూలై 8: విధి నిర్వహణలో మద్యం సేవిస్తే ఉపేక్షించేది లేదని ఆర్టీసీడీఎం విశ్వనాథ్ తెలిపారు. ఆసిఫాబాద్‌డిపోకు చెందిన నలుగురు డ్రైవర్లు ఈజూన్ 27న హైదరాబాద్‌కు విధుల్లో భాగంగా డ్యూటీకి వెళ్లారు. అదేరోజు సాయంత్రం డ్రైవర్లకు కేటాయించిన రెస్ట్‌రూంలో మద్యం సేవిం చారు. అధికారులకు అనుమానం రావడంతో సదరు సిబ్బందికిపరీక్షలు నిర్వ హించగా మద్యం సేవించినట్లు రుజువుకావడంతో అక్కడి అధికారులు డీఎం కు వివరాలు పంపించారు. దీంతో మద్యం సేవించిన నలుగురు డ్రైవర్లపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు.

సదరమ్ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

ఆసిఫాబాద్, జూలై 8: జిల్లాలో ఈనెల2న నిర్వ హించే సదరం శిబిరలను సద్వినియోగం చేసుకో వాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 12న మూగ, చెవిటి, 15న మానసిక వైకల్యం, 22న కంటిచూపు, 27, 30న ఎముకలు సంబంధించిన వారు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

గుట్కా పట్టివేత

కెరమెరి, జూలై 8: మండలకేంద్రంలో సోమవారం ఓ పాన్‌షాప్‌పై దాడిచేసి సుమారు రూ.10,900 విలు వచేసే గుట్కాను పట్టుకున్నట్లు ఎస్సై విజయ్ తెలిపారు. ఈమేరకు పాన్‌షాప్ నిర్వాహకుడు ప్రకా ష్‌పై అతనికి గుట్కా అమ్మిన హసన్‌చావుస్‌పై సైతం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మాజీ ఎంపీటీసీకి సన్మానం

జైనూర్, జూలై 8: మండలంలోని ఉషేగాంలో మాజీఎంపీటీసీ కుంర భగ్వంత్‌రావ్‌ను గ్రామస్థులు సోమవారం ఘనంగా సన్మానించారు. ఐదు సంవత్స రాలపాటు తమ గ్రామంలో నెలకొన్న సమస్యల్ని భగ్వంత్‌రావ్ పరిష్కరించడంతో కీలకపాత్ర పోషిం చాడని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్, అంగన్‌వాడీ, సీహెచ్‌డబ్ల్యూవోలు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ తరగతులు

దహెగాం, జూలై 8: మండలకేంద్రంలోని అంగన్ వాడీటీచర్లకు నూతన విద్యావిధానంపై మూడురోజు లుగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ సంద ర్భంగా సీడీపీవో సురేఖ మాట్లా డుతూ శిక్షణ తరగ తుల్లో నేర్చుకున్న అంశాలను ప్రిస్కూల్ పిల్లలకు నేర్పించాలన్నారు. ప్రియదర్శిని పుస్తకం ద్వారా రోజు వారి పాఠ్యాంశాలు నేర్పించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ అనసూర్య, సరోజన, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

- కలెక్టర్ వెంకటేష్ దోత్రే



దరఖాస్తులను స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేష్‌దోత్రే

ఆసిఫాబాద్, జూలై 8: ప్రజా వాణి దరఖాస్తులను త్వరగా పరి ష్కరించే విధంగా చర్యలు తీసుం టామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సోమవారం జిల్లా కేంద్రం లోని కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, దాసరి వేణు, ఆర్డీ వోలు లోకేశ్వరరావు, సురేష్‌తో కలిసి అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కాగజ్‌నగర్ మండ లం చింతగూడకు చెందిన శంకర్ తనకు వికలాంగ పెన్షన్ మంజూరు చేయాలని దరఖాస్తుఅందజేశారు. కెరమెరి మండలం గౌరి గ్రామానికి చెందిన సావిత్రిబాయి తన భర్త మరణించడంతో ఆయన పేరిట గల అటవీహక్కు పత్రాన్ని తనపేరుపై మార్చిడి చేయాలని, వాంకిడి మండలం ఖమాన గ్రామానికి చెందిన రాజబోయిన రాజన్న తన పేరిటగల భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేసి పాస్‌పుస్తకాలు మంజూరు చేయాలని దరఖాస్తు చేసుకున్నారు. కాగజ్‌నగర్ మండలం దుర్గానగర్ గ్రామానికి చెందిన సుమిత్ర సర్కార్ ఉపాధి కొరకు చౌకధరల దుకాణం మంజూరు చేయాలని, చింతల మానేపల్లి మండలం డబ్బా గ్రామానికి చెందిన సోంబాయి తనపేరిట గ్రామశివారులో ఉన్న పట్టా భూమిని కొందరు అక్రమంగా ఆక్రమించుకు న్నారని ఈ విషయంలో విచారించి తనకు న్యాయం చేయా లని దరఖాస్తు చేసుకున్నారు. ఆసిఫాబాద్ మండలం ఈదులవాడకు చెందిన మంజుల చేపల పెంపకం కొరకు అన్ని అర్హతలు ఉన్నాయని, మహిళాశక్తి పథ కం ద్వారా ఆర్థిక సహాయం అందజేయాలని, దహె గాం మండలం గెర్రె గ్రామానికి చెందిన నానయ్య తన పేరిట ఉన్న భూమికి కొందరు ఆక్రమించుకుని ఇల్లు నిర్మించుకుంటామని బెదిరిస్తున్నారని ఈ విషయమై తనకు రక్షణ కల్పిస్తూ న్యాయం చేయా లని దరఖాస్తు సమర్పించారు. అలాగే మరికొంత మంది వివిధ సమస్యలపై కలెక్టర్‌కు దరఖాస్తు చేరుసుకున్నారు.

ఇంటింటా ఇన్నోవేటర్‌తో నూతన ఆవిష్కరణలకు ప్రోత్సాహం

ప్రభుత్వం చేపట్టిన ఇంటింటా ఇన్నోవేటర్-2024 కార్యక్రమం ద్వారా గ్రామీణప్రాంతాల నుంచి ప్రజా ఉపయోగకరమైన ఆవిష్కరణలను ప్రోత్సహిస్తామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సోమవారం కలెక్ట రేట్‌లో ఆయన అధికారులతో కలిసి ఇంటింటా ఇన్నో వేటర్ కార్యక్రమం గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమం ద్వారా గ్రామీణ ఆవిష్కర్తలకు సాధికార కల్పిస్తామన్నారు. అద్భుతమైన ఆలోచనలు, ప్రాజెక్టులు రూపొందించిన అన్నివర్గాల ఆవిష్కర్తల నుంచి ఆవిష్కరణలను స్వీకరిస్తామన్నారు. గొప్ప ఆవిష్కరణలను ఎంపిక చేసి ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అవార్డు ప్రదానం చేస్తామ న్నారు. ఆవిష్కర్తలు దరఖాస్తులను నేరుగా వాట్సాప్ ద్వారా 9100678543 నెంబరుకు పంపించవచ్చన్నారు.

మూడో రోజుకు చేరుకున్న అంగన్‌వాడీ ఉద్యోగుల రిలే దీక్షలు

ఆసిఫాబాద్, జూలై 8: జీవో నెం.10ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీ ఉద్యోగులు కలెక్టరేట్ ఎదుట చేపడు తున్న రిలేదీక్షలు సోమవారం మూడోరోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో సీఐటీయూ నాయకులు రాజేందర్, అంగన్‌వాడీలు ఉమాలక్ష్మి, చాయ, శంకరమ్మ, స్వర్ణ, రత్నమాల తదితరులు పాల్గొన్నారు.



దీక్షల్లో కూర్చున్న అంగన్‌వాడీలు



భూగర్భ గనులే దేశానికి శ్రేయస్కరం

శ్రీరాంపూర్, జూలై 8: భూగర్భ గనులే దేశానికి శ్రేయస్కరమని కేంద్ర బొగ్గు గనులశాఖ మంత్రి జి కిషన్‌రెడ్డి అన్నారు. సింగరేణి కోల్‌మైన్స్ కార్మిక సంఘ్(బీఎంఎస్) నాయకులు మందరమాకాంత్, పులిరాజారెడ్డి, ఏఐటీయూసీ అధ్యక్ష, కార్యదర్శులు వి సీతారామయ్య, కొరిమి రాజ్‌కుమార్, ఐఎన్‌టీయుసి సెక్రటరీ జనరల్ బి జనక్‌ప్రసాద్, నరసింహారెడ్డి, తదితరులు సోమవారం కిషన్‌రెడ్డిని కలిసి సింగరేణి బొగ్గు బ్లాకులను వేలం వేయవద్దని వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సింగరేణి బొగ్గు బ్లాకులను సింగరేణికే వచ్చేలా చూస్తామన్నారు.

'ఉత్తర్వులను వెంటనే రద్దు చేయాలి'

శ్రీరాంపూర్, జూలై 8: పసుపు, ఎరుపు కార్డుల విధానం అమలుచేసే ఉత్తర్వులను వెంటనే రద్దుచేయాలని బీఎంఎస్ కేంద్ర ఉపాధ్యక్షుడు చాట్ల అశోక్ ఒకప్రకటనలో డిమాండ్ చేశారు. సింగరేణి యాజమాన్యం తన ఆధిప త్యాన్ని కార్మికులపై చూపేందుకు సదరు నిర్ణయం తీసుకుందన్నారు. పసుపు, ఎరుపు కార్డులను చూపించి క్రమశిక్షణ పేరుతో చార్జిషీట్లు, సస్పెండ్లు చేసేం దుకు కుట్ర పన్నుతోందని ఆరోపించారు.

కాసిపేట: సింగరేణిలో పసుపు, ఎరుపు రంగు కార్డుల పేరిట కార్మికులను వేధించడం వెంటనే మానుకోవాలని ఏఐటీయూసీ పిట్‌కార్యదర్శి మీనుగు లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం కాసిపేట 1, 2 గనుల్లో నిరసన చేపట్టి గని మేనేజర్‌లకు వినతిపత్రం అందించారు. వెంటనే ఈవిధానాన్ని విరమిం చుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రాజేందర్, సురేష్, శంకర్, రంజిత్, శ్రీహరి, కిష్టయ్య, దినేష్‌రమేష్, మురళీ పాల్గొన్నారు.

'ఐక్య ఉద్యమాలతోనే సింగరేణిని కాపాడుకుందాం'

కాసిపేట, జూలై 8: సింగరేణిని కాపాడుకునేందుకు పార్టీలకతీతంగా ఐక్య ఉద్యమాలు చేయాలని సీఐటీయూ డిప్యూటీ జనరల్‌సెక్రెటరీ నాగరాజు గోపాల్ అన్నారు. సోమవారం కాసిపేట2 గనిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొన్ని కార్మికసంఘాలు ఐక్య ఉద్యమాలకు రాకుండా ఒంటరిగా పోరాటం చేస్తున్నాయని, ఈ విధానంవల్ల ఐక్యత లోపించి సింగరే ణికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. అందరు ఐక్య ఉద్యమాలకు కలిసి రావాలన్నారు.సింగరేణిని కాపాడుకునేందుకు ఈనెల10న జీఎం కార్యా లయాల ముందు చేసే ధర్నాలకు కార్మికులకు అధిక సంఖ్యలో తరలిరావా లన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ బ్రాంచికార్యదర్శి అల్లిరాజేందర్, ఏఐటీ యూసీ పిట్‌సెక్రటరీ గొల్ల శ్రీనివాస్, సురేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు బ్లాకులను సింగరేణికే కేటాయించాలి



మందమర్రిలో దీక్షలు చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

శ్రీరాంపూర్, జూలై 8: సింగరేణికి చెందిన బొగ్గు బ్లాకులను సింగరేణికే కేటాయించాలని సీపీఐ రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్, ఏఐటీయూసీ ఉప ప్రధానకార్యదర్శులు కె వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కె బాజీసైదా డిమాండ్ చేశారు. బొగ్గు బ్లాకులవేలంను విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఈ నెల 13వతేదీవరకు నిర్వహించనున్న రిలేనిరసన దీక్షలను జీఎం కార్యాలయం ఎదుట సోమవారం ప్రారంభించారు. అనంతరం మాట్లాడారు. ప్రభు త్వరంగ సంస్థ అయిన సింగరేణి బొగ్గు బ్లాకు లను ప్రైవేటువ్యక్తులకు వేలంద్వారా అప్పగిం చడం సరికాదన్నారు. కార్యక్రమంలో బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్‌రావు, సీపీఐ మండల కార్యదర్శి జోగుల మల్లయ్య, మిర్యాల రాజేశ్వర్ రావు, బ్రాంచ్ సంయుక్త కార్యదర్శి రాచర్ల చంద్ర మోహన్, సంపత్, తదితరులు పాల్గొన్నారు.

మందమర్రి టౌన్: బొగ్గు గనుల వేలం పాటలు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం జీఎం కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రిలే దీక్షలు చేపట్టారు. సీపీఐ జిల్లాకార్యదర్శి రామడుగు లక్ష్మణ్, ఏఐటీయూసీ కేంద్రకమిటీ నాయకులు చిప్పనర్సయ్య, బ్రాంచికార్యదర్శులు సలేంద్ర సత్యనారాయణ, దాగం మల్లేష్ దీక్షకారుల మెడలో దండలు వేసి దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మికవ్యతిరేక విధానాలపై రాజీలేని పోరాటాలు చేస్తామని తెలిపారు. దీక్షలు చేపట్టిన వారిలో నాయకులు కంది శ్రీనివాస్, గాండ్ల సంపత్, ఇప్పకాయల లింగయ్య, గోపతి సత్యనారాయణ, మనోహర్, టేకుమట్ల తిరుపతి, అన్నిగనుల పిట్ కార్యదర్శులున్నారు.

- కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బొగ్గు గనుల వేలంపాటలకు వ్యతిరేకంగా సింగరేణిలో ఆందోళనలు కొనసాగుతున్నాయి. పదిరోజు లుగా ధర్నాలు, నిరసనలు, ప్రభుత్వ దిష్టి బొమ్మల దహనాలు, జీఎం కార్యాలయాల ఎదుట దీక్షలు, రాస్తా రోకోలు సాగుతున్నాయి. హెచ్ఎంఎస్ మినహాయిస్తే మిగతా నాలుగు జాతీయసంఘాలు టీబీజీకేఎస్, చిన్నాచితక సంఘాలు వేర్వేరు ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. సింగరేణిలో వేలం రద్దుకు కార్మిక సంఘాలన్నీ ఒక్కటి కావాలని కార్మిక వర్గం కోరుకుంటోంది.

రక్షణ, ఆరోగ్యానికి మరింత ప్రాధాన్యం ఇవ్వాలి

మందమర్రి టౌన్, జూలై 8: మహారాష్ట్రలోని కోల్ ఇండియా నాగపూర్‌లో రెండు రోజుల పాటు జరిగే కార్మికుల ఆరోగ్యం, రక్షణకు సంబంధించిన సెమినార్‌కు మందమర్రి ఏరియా నుంచి సీనియర్ మైనింగ్ సర్దార్, ఐఎన్‌టీయూసీ కేంద్రకమిటీ సీనియర్ ఉపాధ్యక్షుడు కాంపెల్లి సమ్మయ్య హాజరయ్యారు. ఆయన మొదటిరోజు సమావేశంలో దేశవ్యాప్త ప్రతి నిధులతో పరిచయ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సెమినార్‌లో ప్రధానంగా దేశ వ్యాప్తంగా ఉన్న బొగ్గు గనుల్లో కార్మికులకు సంబంధించి ఆరోగ్యానికి సంబంధించి చర్యలు అంతంత మాత్రంగానే ఉంటున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్ స్థాయి వైద్యం గురించి చెప్పడం తప్ప ఆచరణలో అమలు కాకపోవడం శోచనీయమని విచారం వ్యక్తం చేశారు. ఆరోగ్యం, రక్షణ సింగరేణికి రెండు కండ్లలాంటివన్నారు. అంతకుముందు ఆల్ ఇండియా డైరెక్టర్‌మైన్స్‌సేఫ్టీ మేనేజ్మెంట్ అధికారి ప్రభాత్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

కార్మిక హక్కుల సాధన కోసం మహాసభలు

- యాదగిరి సత్తయ్య

మందమర్రి టౌన్, జూలై 8: కార్మికుల పెండింగ్ సమస్యల సాధనకై ఈనెల14న శ్రీరాంపూర్‌లో 28వ మహాసభలను నిర్వహిస్తున్నామని బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య తెలిపారు. సోమవారం పట్టణంలోని బీఎంఎస్ కార్యాలయం వద్ద ఆయన మాట్లాడుతూ సింగరేణి కార్మికులకు సొంతింటి కలతోపాటు మారుపేర్ల మార్పు తదితర సమస్యలను మహాసభల్లో ప్రస్తావిస్తామన్నారు. ఈ సభలకు ముఖ్య అతిథులుగా కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ హాజరవుతారని అన్నారు. అదేవిధంగా బొగ్గుపరిశ్రమల ఇన్‌చార్జి సుధీర్ గురుడే, ఏబీకేఎంఎస్ ప్రధాన కార్య దర్శి ఆశిష్‌మూర్తి, సీఎంపీఎఫ్ ట్రస్టుబోర్డు సభ్యులు రాంరెడ్డి పాల్గొం టారని తెలిపారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు.

నూతన యంత్రాలతో అధికోత్పత్తి: జీఎం



ఎస్‌డీఎల్‌ను ప్రారంభిస్తున్న జీఎం

శ్రీరాంపూర్, జూలై 8: నూతన యంత్రాలతో అధికోత్పత్తి సాధిస్తామని శ్రీరాంపూర్ ఏరియా జీఎం బి సంజీవరెడ్డి అన్నారు. ఆర్కే5 గనికి మంజూరైన ఎస్‌డీఎల్ యంత్రాలను సోమవారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ, ఒక్కో యంత్రం సుమారు 50 లక్షల రూపాయల విలువ ఉంటుందన్నారు. వీటి ద్వారా సాధ్యమైనంత ఎక్కువ ఉత్పత్తి సాధించవచ్చని పేర్కొన్నారు. శ్రీరాంపూర్ ఏరియాకు మొత్తం 29 ఎస్‌డిఎల్ యంత్రాలు మంజూరైనట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అధికారుల సంఘం శ్రీరాంపూర్ ఏరియా అధ్యక్షుడు కె వెంకటేశ్వర్ రెడ్డి, ఇన్‌చార్జి ఎస్‌వోటు జీఎం ఏవీ రెడ్డి, ఏజీఎం(ఫైనాన్స్) మురళీధర్, డీజీఎం(పర్సనల్) పి అరవిందరావు, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డి, గని మేనేజర్ అబ్దుల్‌ఖాదిర్, గని రక్షణాధికారి శివయ్య, సంక్షేమాధికారి రణదీప్‌గౌడ్, పిట్ కార్యదర్శి నర్సింగరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల కుటుంబాలకు స్వచ్ఛమైన నీరు

ఉద్యోగుల కుటుంబాలకు స్వచ్ఛమైన నీరు అందించనున్నట్లు శ్రీరాంపూర్ ఏరియా జీఎం బి సంజీవరెడ్డి తెలిపారు. నస్పూర్ సివిల్ కార్యాలయం వద్ద 10 లక్షల రూపాయలతో నిర్మించిన నూతన మినరల్ వాటర్ ప్లాంటును సోమవారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ, సింగరేణి ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణలో సంస్థ ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు.

బొగ్గు బ్లాకుల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడాలి

● మావోయిస్టు కోల్‌బెల్ట్ కమిటీ కార్యదర్శి ప్రభాత్

మంచిర్యాల, జూలై 8 (ఆంధ్రజ్యోతి): సింగరేణి బొగ్గుగనుల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడాలని భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) సింగరేణి కోల్‌బెల్ట్ కమిటి కార్యదర్శి ప్రభాత్ సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. కొత్త బొగ్గు గనులను వేలం పేరిట ప్రైవేటీకరించే కేంద్ర ప్రభుత్వ కుట్రలను కార్మిక సంఘాలు, ట్రేడ్ యూనియన్లు, కార్మికులు, ప్రజలు, మేధావులు, ప్రజాసంఘాలు ముక్తకంఠంతో ఖండించాలని కోరారు. మోదీ విద్రోహపూరితమైన నిర్ణయాల పట్ల ప్రజానీకంలో చర్చనీయాంశమైన సింగరేణి కార్మిక పోరాటలకు సంఘీభావాలు వ్యక్తమవుతుండగా కోల్‌బెల్ట్ ఎంఎల్‌ఏలు, ఎంపీలు, మంత్రులు మౌనం వహించడం క్షమించరాని తప్పిదంగా వర్ణించారు. గుర్తింపుసంఘం ఏఐటీయూసీ నాయకుడు సీతారామయ్య ఉద్యమవెన్నుపోటు దారునిగా మారి పైరవీలకు పెద్దపీట వేస్తున్నాడని, ఐఎన్టీయూసీ నేత జనక్‌ప్రసాద్ కేవలం పత్రికల్లో ప్రకటనలు, పైరవీలకే పరిమితం అవుతున్నాడని విమర్శించారు.

యూనియన్‌ను యాజమాన్యానికి తాకట్టుపెట్టి తాబేదారులుగా వెన్నెముక లేని వారిని నియమించుకొని సింగరేణి పోరాటాలను నీరుగార్చుతున్నాడని ఆరోపించారు. ఇరువురు నాయకులు సింగరేణి ప్రైవేటీకరణకు వ్యతిరేకపోరాటాన్ని తప్పుదోవ పట్టిస్తూ ఐక్యఉద్యమాలను బలహీనపరుస్తున్నారని ధ్వజమెత్తారు. భవిష్యత్తులో వారికి కార్మిక వర్గం తగిన గుణపాఠం చెప్పక తప్పదని తెలిపారు. కోల్‌బెల్ట్ ఏరియాలోని ఎంఎల్‌ఏలు, ఎంపీలు, మంత్రులు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కేంద్రంపై ఒత్తిడి తెచ్చి బొగ్గు గనుల వేలం రద్దయ్యేలా పోరాటలలో కలిసి రావాలని సూచించారు.

సింగరేణిలో 51 శాతం వాటా కలిగిన రాష్ట్ర ప్రభుత్వం స్వయం నిర్ణయాధికార హక్కును కాపాడుకునేందుకు, సంస్థ పరిరక్షణకు మద్దతివ్వాలని డిమాండ్‌చేశారు. అలాగే సింగరేణిలో బీసీ,ఎస్సీ,ఎస్టీ సంఘాలు, అంబేద్కర్ సంఘాలు సంస్థ మనుడగ కోసం జరిగే పోరాటంలో కలిసి ఉద్యమించాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా పలు డిమాండ్లను ముందుంచారు. సింగరేణి ప్రైవేటీకరణను వెంటనే రద్దు చేయాలి, బొగ్గు బ్లాకులను భేషరతుగా సింగరేణికే అప్పగించాలి, ఓపెన్ కాస్టులను రద్దు చేసి భూగర్భ గనులను ప్రోత్సహించాలి, సింగరేణి సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

గంజాయి విక్రయాలను అరికట్టాలి

మందమర్రి టౌన్, జూలై 8: మందమర్రి పట్టణంలోని మూడోజోన్‌లో గంజాయి విక్రయిస్తున్నారని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ సీఐ ఇంద్రప్రసాద్‌కు కాంగ్రెస్‌నాయకులు బత్తుల సరిత, దాసరి సమత, కొడారి శ్రీలత వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ పట్టణంలో కల్తీసారా అమ్ముతున్నారని, గంజాయికి యువత, కల్తీసారాకు కూలీలు అలవాటుపడి జీవితాలను పాడుచేసుకుంటున్నారన్నారు. దీనివల్ల కుటుంబాలు రోడ్డునపడుతున్నాయని తెలిపారు.గంజాయి విక్రయిస్తున్న వారిని పట్టుకొని చర్యలు తీసుకోవాలని తెలిపారు.

రక్తదాన శిబిరం

మంచిర్యాల అర్బన్, జూలై 8 : మంచిర్యాల లయన్స్‌క్లబ్ సీనియర్ లయన్ మెంబర్ మేక వరప్రసాద్ జన్మదినాన్ని పురస్కరించుకొని పట్టణంలోని తేజ డయగ్నోస్టిక్ సెంటర్‌లో సోమవారం రక్తదానశిబిరాన్ని నిర్వహించారు. ఆయన సతీమణితోపాటు లయన్స్‌క్లబ్‌సభ్యులు వాలేటి శ్రీనివాస్, డేగబాబు, చంద్రమౌళి, బాలాజీ, వారిమిత్ర బృందం 35మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. అధ్యక్షుడు బాల్‌మోహన్, ప్రోగ్రాం ఛైర్‌పర్సన్ వి.మధుసూ దన్ రెడ్డి, సభ్యులు వినయ్‌కుమార్, గుండా శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, భాస్కర్‌రెడ్డి, చందూరిమహెందర్,తదితరులు పాల్గొన్నారు.

ఎంసీపీఐయూ మండల కార్యదర్శిగా సతీష్‌కుమార్

బెల్లంపల్లి, జూలై 8: ఎంసీపీఐయూ మండల కార్యదర్శిగా పట్టణానికి చెందిన ఆరేపల్లి సతీష్‌కుమార్ నియమితులయ్యారు. ఈమేరకు జిల్లా సహాయకార్యదర్శి పసులేటి వెంకటేష్, పట్టణ కార్యదర్శి రమేష్‌లు సోమవారం సతీష్‌కుమార్‌కు నియామక పత్రం అందించారు.

నూతన బోరు మోటారు ఏర్పాటు

భీమారం, జూలై 8: భీమారంలోని పోలంపల్లి గ్రామంలోని హనుమాన్ ఆలయం వద్ద ఉన్న తాగునీరు బోరు మోటారు పాడైపోవడంతో విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి సోమవారం నూతన బోరు మోటారు ఏర్పాటు చేయించడం జరిగిందని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. గత 15 రోజులుగ నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్న ప్రజలనీటికష్టాలు తీరాయన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌నాయకులు మంతెన సమ్మయ్య, సంపత్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ విజేత నస్పూర్

శ్రీరాంపూర్, జూలై 8: జిల్లాసాయి క్రికెట్ టోర్నమెంట్ విజేతగానస్పూర్ మండలజట్టు నిలిచింది. జిల్లాలోని18మండలాలకు చెందిన ఫొటో అండ్‌వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ క్రికెట్ పోటీలు ఈనెల 20నుంచి నిర్వహిస్తుండగా, 12జట్లు ఇందులో పాల్గొన్నాయి. క్రిష్ణకాలనీలోని శాంతి స్టేడియంలో సోమవారం ఫైనల్ మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్‌లో టాస్‌గెలిచి ముందుగా బ్యాటింగ్ ఎంచుకున్న నస్పూర్‌జట్టు నిర్ణీత 12ఓవర్లలో 92పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన బెల్లంపల్లి జట్టు 64పరుగులకే ఆలౌట్ అయ్యింది. దీంతో విజేతగా నస్పూర్‌జట్టును ప్రకటించారు. ఈ జట్టులో చిన్న సుధాకర్ ఆల్‌రౌండర్‌గా ప్రతిభ కనబరిచి మ్యాన్‌ఆఫ్‌ది మ్యాచ్, మ్యాన్‌ఆఫ్‌దిసిరీస్ గెల్చుకున్నాడు. ఇరు జట్లకు బహుమతులు అందించారు. అనంతరం అసోసియేస్ జిల్లాఅధ్యక్షుడు నల్ల సతీష్ మాట్లాడుతూ, క్రీడలుమానసికోల్లాసానికి ఉపయోగపడతాయని తెలిపారు. నిరంతరం బిజీగాఉండే ఫొటో, వీడియోగ్రాఫర్స్ గొప్ప క్రీడాస్ఫూర్తితో టోర్నమెంట్‌లో పాల్గొనడం ఆనందదాయకమన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా ప్రధానకార్యదర్శి గని రవీందర్, కోశాధికారి శ్రీపతిరవి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కనకయ్య గౌడ్, నిర్వాహకులు ముక్కెర శ్రీను, చిన్న సుధాకర్, నూనె సురేష్, సాంబారు రాము, లడ్డ సాయి, మేరుగు భానుప్రకాష్, అభిలాశ్ రెడ్డి, జిల్లాలోని 18మండలాలకు చెందిన అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

అన్ని పాములు విషపూరితమైనవి కావు



పామును చూపిస్తూ అవగాహన కల్పిస్తున్న స్నేక్ సొసైటి సభ్యులు

జైపూర్, జూలై 8: అన్ని పాములు విషపూరిత మైనవికావని ఎఫ్ఆర్‌వో రత్నాకర్‌రావు పేర్కొన్నారు. సోమవారం కేజీబీవీ పాఠశాలలో విద్యార్థినులకు అటవీశాఖ అధికారులు, సింగరేణి స్నేక్‌సొసైటీ సభ్యులతో కలిసి అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణలో 3రకాల విషపూరిత సర్పాలు పింజర, నాగుపాము, కట్లపాములు ఉన్నాయన్నారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే పాములు రావని పేర్కొన్నారు. పాము కరిచినప్పుడు ఆ ప్రదేశంలో కట్టుక ట్టడం లాంటివి చేయకూడదని, నోటిద్వారా కాటు వేసిన ప్రాంతంనుంచి రక్తాన్ని తీయడంవల్ల ఇద్దరికి ప్రాణాపాయం ఉంటుందన్నారు. పాము కరిచినచోట ఐస్‌పెట్టడం, కరెంటు షాక్ ఇవ్వడం చేయకూడదని త్వరగా ఆసుపత్రికి తరలించాలని సూచించారు. అనంతరం స్నేక్ సొసైటీ సభ్యులు పాములను ప్రత్యక్షంగా చూపిస్తూ అవగాహన కల్పించారు. స్నేక్ సొసైటీ సభ్యులు రాజు, శ్రీనివాస్, డీఆర్‌వో సాగరిక, ఎఫ్ఎస్‌వో రాంసింగ్, ఎఫ్‌బీవో అనూష, స్పెషల్‌అధికారి ఫణిబాల తదితరులు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులకు సన్మానం

దండేపల్లి, జూలై 8: తాళ్ళపేట, రాజుగూడ గ్రామాల కాంగ్రెస్ పార్టీ, వివిధ సంఘాల నాయకులు పదవి కాలం పూర్తి చేసుకున్న ఎంపీటీసీ కంది హేమలతసతీష్‌లను సన్మానించారు. స్థానిక ప్రభుత్వ వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు. ఇటీవల లక్సెట్టిపేట మార్కెట్‌కమిటీ డైరెక్టర్‌గా ఎన్నికైన కనకజంగును సన్మానించారు. మాజీ సర్పంచులు కాంతరావు, లింగారావు, మాజీఎంపీటీసీ రాజయ్య, నాయకులు నర్సయ్య, గ్రామ యువకులు, సంఘాల సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

జన్నారం: ఇటీవల పదవీ కాలం పూర్తయిన జన్నారం జెడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్‌ను సోమవారం నేతకాని సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాళ్లపల్లి రాజేశ్వర్ జన్నారంలో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

పోడు వివాదం పరిష్కరించాలి

దహెగాం(పెంచికలపేట), జూలై 8: పెంచికలపేట మండలం కొండపల్లిలో పోడు భూముల వివాదాన్ని అటవీఅధికారులు పరిష్కరించాలని బీజేపీ నాయకుడు పాల్వాయి సుధాకర్‌రావు అన్నారు. సోమవారం పెంచికలపేట పోలీసు స్టేషన్‌లో కాగజ్‌నగర్ రూరల్ సీఐ రాంబాబు, అటవీ అధికారులతో మాట్లాడారు. పోడు సాగు చేసుకుంటున్న రైతులకు వారం రోజుల గడువు ఇవ్వాలని అటవీశాఖ అధికారులను కోరారు. ఈ విషయాన్ని అటవీ ఉన్నతాధికారులకు తెలియజేస్తామని తెలిపారు. అంతకుముందు కొండపల్లి గ్రామంలోని సర్వేనెం.137లో అటవీ అధికారులు మొక్కలు నాటేందుకు ట్రాక్టర్‌తో చదును చేస్తుండగా కొండపల్లి రైతులు అటువైపు వెళ్లడానికి సమా యత్తమవుతున్న సమయంలో ఎస్సై కొమురయ్య రైతులకు, అటవీ శాఖఅధికారులకు ఫోన్ ద్వారా పోలీసుస్టేషన్‌కురావాలని సూచించారు. దీంతో బీజేపీ నాయకుడు పాల్వాయి సుధాకర్‌రావు రైతులతో కలిసి పోలీసుస్టేషన్‌కు వెళ్లి సీఐ, అటవీఅధికారులతో చర్చించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి



మృతి చెందిన గేదె

దహెగాం, జూలై 8: మండలంలోని గెర్రెగ్రామానికి చెందిన పాకాల శంకర్‌కు చెందిన గేదె ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతిచెందింది. సోమవారం ఉదయం కాపరి గేదెలను మేపడానికి గ్రామసమీపంలోని చెరువు కట్టకు తీసుకెళ్లగా అక్కడ ఉన్న విద్యుత్ ట్రాన్స్‌పార్మర్‌వైరు తగిలి మృతిచెందినట్లు కాపరి తెలిపాడు.

రోడ్డుపై చెట్టును తొలగించరూ



రోడ్డుపై పడి ఉన్న చెట్టు

చింతలమానేపల్లి, జూలై 8: మండలంలోని కేతిని-చిత్రామ గ్రామాల మధ్య ఉన్న ప్రదానరహదారిపై అటవీప్రాంతంలో ఇటీవల కురిసిన వర్షాలకు ఓవృక్షం రోడ్డుకు అడ్డంగా పడిపోయింది. చెట్టుకొమ్మలను కొట్టించిన అధికారులు దాన్ని పూర్తిగా రోడ్డు పైనుంచి తొలగించలేదు. దీంతో వచ్చిపోయే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు రోడ్డుపై ఉన్న చెట్టును తొలగించి ప్రయాణికుల కష్టాలు తీర్చాలని పలువురు కోరుతున్నారు.

ధర్నాను జయప్రదం చేయండి

దహెగాం(పెంచికలపేట), జూలై 8: కార్మికుల కోర్కెల దినం (డిమాండ్స్ డే) సందర్భంగా ఈనెల10న అన్ని మండల కేంద్రాల్లో జరిగే ధర్నాలను జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకులు కృష్ణమచారి కోరారు. సోమవారం పెంచికలపేట మండలం ఎల్కపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో ధర్నాకరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్యామల, సుశీల, సంగీత, మల్లిక, పద్మ, శిరీష, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడి మృతి

వాంకిడి, జూలై 8: మండల కేంద్రానికి చెందిన గిరిజన సంక్షేమశాఖలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు మడావి రాజేశ్వర్ (56) ఆదివారం రాత్రి గుండెపోటుతో మృతిచెందాడు. మూడు రోజుల క్రితం గుండెనొప్పి రావడంతో ఆయనను మహారాష్ట్రలోని చంద్రాపూర్ ప్రైవేటు ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అక్కడ చికత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. కాగా రాజేశ్వర్ తిర్యాణి మండలం గుండాల గిరిజన పాఠశాలలో పని చేస్తున్నాడు. అతనికి భార్య, ఒక కూతురు, ఒక కుమారుడు ఉన్నారు. ఆయన మృతిపట్ల ఉపాధ్యాయ సంఘాల నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి


హరికృష్ణ (ఫైల్)

దండేపల్లి, జూలై 8: తల్లిదండ్రులు మందలించారని యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. నెల్కివెంకటాపూర్‌కు చెందిన బోడకుంటి శ్రీధర్‌-చంద్రకళ రెండో కుమారుడు బోడకుంటి హరికృష్ణ(22) కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. కొన్ని రోజుల నుంచి ఏ పని చేయకుండా మద్యం తాగుతూ ఉంటున్నాడు. తల్లిదండ్రులు పలుమార్లు మందలించారు. ఈనెల 6న మండల కేంద్రంలో పురుగుల మందు తాగి మిత్రుడికి ఫోన్‌ చేసి చెప్పాడు. అతడు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో లక్సెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు కరీంనగర్‌లో ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడి తండ్రి శ్రీధర్‌ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జి. ఉదయ్‌కిరణ్‌ వెల్లడించారు.

తండ్రి చేతిలో కొడుకు హత్య


వినోద్‌ (ఫైల్‌)

బెల్లంపల్లి, జూలై 8: ఆస్తి వాటా కోసం వేధిస్తున్న కన్న కొడుకును తండ్రే హత్య చేసిన సంఘటన ఆకెనపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. రూరల్‌ సీఐ అఫ్జలొద్దీన్‌ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన దేవ మార్కులు ఇద్దరు కొడుకులు. పెద్ద కొడుకు దేవ వినోద్‌(30) తం డ్రి పేరు మీద ఉన్న రెండున్నర ఎకరాలను తన పేరు మీద పట్టా చేయాలని గొడవ పడుతున్నాడు. సోమవారం ఉదయం గొడవపడడంతో పెద్ద మనుషులను తీసుకువస్తానని గ్రామంలోకి వెళ్లాడు. పెద్ద మను షులు అందుబాటులో లేరని, మధ్యాహ్నం వస్తారని వారి సమక్షంలో మాట్లాడుకుందామని కొడుకు తెలిపాడు. తనకు ఇప్పుడే ఆస్తి పంచాలని గొడవపడ్డాడు. ఆగ్రహానికి గురైన తండ్రి గొడ్డలితో కొడుకు తలపై కొట్టాడు. వినోద్‌ కేకలు వేయడంతో తల్లి దేవ బీరక్క వచ్చిచూసే సరికి రక్తం మడుగులో ఆగుపించాడు. వెంటనే బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి వినోద్‌ అప్పటికే మృతిచెందాడని కుటుంబీకులకు తెలిపారు. తల్లి బీరక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ పేర్కొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు

బెల్లంపల్లి, జూలై 8: గంజాయి విక్రయాలకు పాల్పడుతున్న ఇద్దరిని సోమవారం అరెస్టు చేసినట్లు రూరల్‌ సీఐ అఫ్జలొద్దీన్‌ తెలిపారు. తాళ్ల గురిజాల రూరల్‌ సీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మందమర్రికి చెందిన మక్కల గంగాధర్‌ మహారాష్ట్రలోని చంద్రాపూర్‌లో గంజాయి కొనుగోలు చేసి రైలు మార్గాన బెల్లంపల్లికి తీసుకువచ్చాడు. రైల్వేస్టేషన్‌ ప్రాంతంలో అనుమానాస్పదంగా కనిపించడంతో తనిఖీ చేయగా 58 గ్రాముల గంజాయి దొరికిందన్నారు. అతన్ని అదుపులోకి తీసుకుని విచారించగా మహారాష్ట్రలోని చంద్రాపూర్‌కు చెందిన విశ్వదేవ్‌మిస్త్రీ నుంచి గంజాయి కొనుగోలు చేసి రైలులో తీసుకువస్తున్నట్టు తెలిపాడు. పోలీసులు చంద్రాపూర్‌కు వెళ్లి విశ్వదేవ్‌మిస్త్రీను అరెస్టు చేసి ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు. టూటౌన్‌ ఎస్‌ఐ రమేష్‌ పాల్గొన్నారు.

ట్రాక్టర్‌ యజమానులపై యువకుల ఫిర్యాదు

జైపూర్‌, జూలై 8 : ఇందారం ట్రాక్టర్‌ యజమానులపై ఆదివారం రాత్రి గ్రామానికి చెందిన కొందరు యువకులు ఎస్‌ఐకి ఫిర్యాదు చేశారు. గోదావరి నుంచి అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ల వీడియోలను వాట్సాప్‌ గ్రూపుల్లో పోస్టు చేశారని, వాటిని పోస్టు చేసిన యువకుల ఇండ్లవద్దకు వెళ్లి ట్రాక్టర్‌ యజమానులు దాడి చేయడంతో ఫిర్యాదు చేశామన్నారు. దీనిపై ఎస్‌ఐ శ్రీధర్‌ను వివరణ కోరగా ఫిర్యాదు తీసుకున్నామని గ్రామంలో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంపులను తమ సిబ్బంది సీజ్‌ చేశారని , దాడి చేసిన ట్రాక్టర్‌ యజమానులపై విచారణ చేపడుతున్నామని ఎస్‌ఐ పేర్కొన్నారు.

మావోయిస్టు నేత హుస్సేన్‌ అరెస్టు


విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ

రామకృష్ణాపూర్‌, జూలై 8: మావోయిస్టు కీలక నేత మహ్మద్‌ హుస్సేన్‌ అలియాస్‌ సుధాకర్‌ అలియాస్‌ రమాకాంత్‌ను అరెస్టు చేసినట్లు మంచిర్యాల డీసీపీ భాస్కర్‌ తెలిపారు. సోమవారం రామకృష్ణాపూర్‌ పోలీ సుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. రెండు నెలలుగా మావో యిస్టు, సికాస భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలనే ఉద్దేశంతో మందమర్రి, రామకృష్ణాపూర్‌ పరిసర ప్రాంతాలలో తిరుగుతున్నాడనే సమాచారంతో సీపీ శ్రీనివాస్‌ ఆదేశాల మేరకు బెల్లంపల్లి ఏసీపీ ఆధ్వర్యంలో తనిఖీలు ముమ్మరం చేశామన్నారు. సోమవారం రామకృష్ణాపూర్‌ ఎస్సై రాజశేఖర్‌ ఆర్కే-1ఏ గని సమీపంలో పెట్రోలింగ్‌ చేస్తుండగా పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నిస్తుండగా హుస్సేన్‌ ఆదుపులోకి తీసుకున్నామన్నారు. అనంతరం ఏసీపీ రవికుమార్‌ ఆధ్వర్యంలో విచారించగా మావోయిస్టు కరపత్రాలు, డాక్యుమెంట్లు, వాల్‌ పోస్టర్లు, సెల్‌ఫోన్‌ను సీజ్‌ చేసి అరెస్టు చేసినట్టు తెలిపారు. మందమర్రికి చెందిన హుస్సేన్‌ ప్రస్తుతం జమ్మికుంట ప్రాంతంలో నివాసం ఉంటున్నాడని, 1978 నుంచి 1981 వరకు సింగరేణి కార్మికుడిగా కెకె-2 గనిలో జనరల్‌ మజ్దూర్‌గా పనిచేసి తొలగించినట్లు తెలిపారు. మందమర్రి సీఐ శశిధర్‌ రెడ్డి, రామకృష్ణాపూర్‌ ఎస్సై రాజశేఖర్‌, సిబ్బందిని ఏసీపీ అభినందించారు.

విడుదల చేయాలని నిరసన

ప్రజాకవి, రచయిత మహ్మద్‌ హుస్సేన్‌ ను అక్రమ అరెస్టు అప్రజాస్వామికమని పోలీసులు ఆయనను విడుదల చేయాలంటూ రామకృష్ణాపూర్‌ పోలీసు స్టేషన్‌ వద్ద పౌర హక్కుల సంఘం, విప్లవ రచ యితల, ప్రజాఫ్రంట్‌ రాష్ట్ర నాయకులు నిరసన చేప ట్టారు. పౌరహక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మాదన కుమారస్వామి మాట్లాడుతూ జమ్మికుంటలో ఇంట్లో ఉన్న అతడిని ఉదయం 5.30 గంటలకు అదుపులోకి తీసుకుని ఎక్కడికి తీసుకెళుతున్నారో చెప్పకుండ రామకృష్ణాపూర్‌ తీసుకువచ్చారన్నారు. ఆయనను విడుదల చేయాలని రాష్ట్ర పౌర హక్కుల సంఘం నాయకులు డిమాండ్‌ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్బంధ పాలన చేయడం సరికాదని 75 సంవత్సరాల వయస్సు ఉన్న వ్యక్తిని ఉద్దేశపూర్వకంగా అరెస్టు చేయడమే కాక మావోయిస్టు అంటూ ప్రకటించడం సరికాదన్నారు. పోలీసుల తీరు సరిగాలేదని, పౌరహక్కుల సంఘం నాయకులను కలవనీయకపోవడం సరికాదన్నారు. ఉమ్మడి కరీంనగర్‌ జిల్లా అధ్యక్షుడు రాజగోపాల్‌, ఉపాధ్యక్షులు సురరిత, నార వినోద్‌, సహాయ కార్యదర్శి వినోద్‌, బోడ్డు రవి, విప్లవ రచయితల సంఘం ఉమ్మడి కరీంనగర్‌ కన్వీనర్‌ బాలసాని రాజయ్య, తెలంగాణ ప్రజా ఫ్రంట్‌ పెద్దపల్లి కన్వీనర్‌ గాండ్ల మల్లేశం, జిల్లా కోకన్వీనర్‌ ఆయిందాల అంజన్న, తెలంగాణ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జైపాల్‌సింగ్‌, దేవి సత్యం, సామాజిక కార్యకర్తలు అరిగెల పద్మ, షేక్‌ రహ్మత్‌, హుస్సేన్‌ కుటుంబ సభ్యులు మహ్మద్‌ రబ్బాని, రసూల్‌ బీ తదితరులు పాల్గొన్నారు.


పోలీసు స్టేషన్‌ ఆవరణలో పౌర హక్కుల సంఘం నాయకులు

ఘనంగా వైఎస్‌ఆర్‌ జయంతి

బెల్లంపల్లి, జూలై 8: మాజీ ముఖ్య మంత్రి వైఎస్‌ రాజశేఖర్‌రెడ్డి జయంతిని సోమవారం కాంగ్రెస్‌ పార్టీ కార్యాలయంలో నాయకులు ఘనంగా నిర్వహించారు. రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్‌ కట్‌ చేసి స్వీట్లు పంచిపెట్టారు. కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

మందమర్రి టౌన్‌: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ మాజీ ముఖ్యమంత్రి దివంగత వైఎస్‌ రాజశేఖర్‌రెడ్డి జయంతిని కాంగ్రెస్‌ పార్టీ దాని అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ ముఖ్యమంత్రిగా ఆయన చేసిన సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. సొత్కు సుదర్శన్‌, కడారి శ్రీనివాస్‌, జమాలుద్దీన్‌, నర్సింగ్‌, రాంబాబు, శేఖర్‌ పాల్గొన్నారు. మార్కెట్‌ సెంటర్లో వైఎస్‌ రాజశేఖర్‌ రెడ్డి జయంతిని ఘనంగా జరిపారు. మంద తిరుమల్‌, పైడిమల్ల నర్సింగ్‌, సజ్జు, రవి, పాషా, వేణు పాల్గొన్నారు.


బెల్లంపల్లిలో కేక్‌ కట్‌ చేస్తున్న కాంగ్రెస్‌ నాయకులు

జన్నారం: దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌ రాజశేఖర్‌రెడ్డి జయంతిని మండల కేంద్రంలో కాంగ్రెస్‌ నాయకులు ఘనంగా నిర్వహించారు. కేక్‌ కట్‌ చేసి స్వీట్లు పంచిపెట్టారు. ముజాహిద్‌ అలీఖాన్‌, మాణిక్యం, ఇసాక్‌, శంకరయ్య, రాకేష్‌, నందునాయక్‌, లక్ష్మీనారాయణ, పాల్గొన్నారు.

చెన్నూరు: దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలను చెన్నూరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్‌ నాయకులు ఘనంగా నిర్వహించారు. కేక్‌ కట్‌ చేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వరకట్నం వేధింపుల కేసులో ఇద్దరి రిమాండ్‌

మంచిర్యాల అర్బన్‌, జూలై 8 : వరకట్నం వేధింపుల కేసులో కోర్టు వాయిదాలకు హాజరుకాని ఇద్దరిని నాన్‌ బెయిలబుల్‌ వారెంట్‌పై అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చగా వారికి స్పెషల్‌ జేఎఫ్‌సీఎం ఇన్‌ఛార్జి మెజిస్ట్రేట్‌ నిరోషా 14 రోజుల రిమాండ్‌ను విధిస్తూ తీర్పును వెలువరించారని మహిళ పోలీస్‌ స్టేషన్‌ సీఐ కెనరేష్‌కుమార్‌ సోమవారం తెలిపారు. 2019లో హైదరాబాద్‌ మలక్‌పేటకు చెందిన గుడి కృపానంద్‌, గుడి ఫిలిప్స్‌లపై వరకట్నం వేధింపుల కింద కేసు నమోదైందని, వారిద్దరు కొంత కాలంగా కోర్టు వాయిదాలకు హాజరు కాకుండా తప్పించుకుతిరుగుతున్నారని సీఐ తెలిపారు. ఎస్‌వీట్యూట్యా బీ విరాజేష్‌, ఎ.ఎస్‌ఐ ఆహ్మద్‌, జి.రామేశ్వర్‌ రావుల సహకారంతో సింధీటలను అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చగా వారికి న్యాయమూర్తి రిమాండ్‌ను విధించినట్లు సీఐ తెలిపారు.

ఆయిల్‌పామ్‌ సబ్సిడీని వినియోగించుకోవాలి

భీమిని, జూలై 8: ఆయిల్‌పామ్‌ సాగులో రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీని రైతులు వినియోగించుకోవాలని ఉద్యానశాఖ అధికారి సుధీర కోరారు. సోమవారం వీగాం, కేస్లాపూర్‌ గ్రామాల్లో ఆయిల్‌పామ్‌ పంటలను పరిశీలించారు. సాగు చేసే విధానం, మొక్కలను వివరించారు. ఆయిల్‌పామ్‌ మొక్కలకు 90 శాతం సబ్సిడీతో డ్రిప్‌ పరికరాలు కేటాయిస్తారని వారిగా ఎస్సీ, ఎస్టీలకు 100 శాతం, బీసీలకు 90 శాతం, మిగితా రైతులకు 50 శాతం రాయితీపై అందిస్తున్నామన్నారు.

రైతులకు అవగాహన

మందమర్రిరూరల్‌ జూలై 8 : పొన్నారంలోని రైతులకు సోమవారం ఏఈవో ముత్యం తిరుపతి నారు మడుల్లో పరిపాలించిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ముఠగుటిని తీసివేసేందుకు మధ్యలో కాలువలు ఏర్పాటు చేసుకోవాలని, నీటిని క్రమం తప్పకుండా అందించాలని పేర్కొన్నారు. రైతులకు ఏమైనా సమస్యలుంటే సంప్రదించాలని సూచించారు.

కిషన్‌రెడ్డిని కలిసిన అందుగుల శ్రీనివాస్‌

మందమర్రి టౌన్‌, జూలై 8: కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డిని సోమవారం హైదరాబాద్‌లో మందమర్రికి చెందిన ఆ పార్టీ జిల్లా సీనియర్‌ నాయకులు అందుగుల శ్రీనివాస్‌ కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

జనక్‌ ప్రసాద్‌ను సన్మానించిన ఐఎన్‌టీయూసీ నాయకులు

రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్‌ బి జనక్‌ ప్రసాద్‌ను మందమర్రికి చెందిన కాంగ్రెస్‌ జిల్లా ఉపాధ్యక్షుడు పల్లెర్ల లక్ష్మణ్‌ హైదరాబాద్‌లో కలిశారు. పుష్పగుచ్ఛం, శాలువాతో సత్కరించారు. రాష్ట్రంలో కనీస వేతనాల అమలుకు, కార్మిక రంగంలో అపార అనుభవం ఉన్న ఆదినేత జనక్‌ ప్రసాద్‌తో సాధ్యమవుతుందని చెప్పారు.



ఆకాశం ఎందుకో ఎర్రబడ్డది...

ఆకాశం ఎర్రబడింది... సూర్యుడు అస్తమించే సమయంలో అగ్నిగోళంలా ఆగుపించాడు... నీలి రంగులో ఉన్న ఆకాశంలో మధ్యలో ఎర్రటి సింధూరంలా ఆగుపించాడు. దండేపల్లి మండల కేంద్రంలో నల్లకుంట చెరువు సమీపంలో సోమవారం సాయంత్రం ఈ దృశ్యం ఆవిష్కృతమైంది.

- దండేపల్లి


ఆసిఫాబాద్‌లో నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్‌ నాయకులు

ఘనంగా వైఎస్‌ రాజశేఖర్‌రెడ్డి జయంతి

ఆసిఫాబాద్‌ రూరల్‌, జూలై 8: మాజీ ముఖ్యమంత్రి దివంగత వైఎస్‌ రాజశేఖర్‌రెడ్డి జయంతిని సోమవారం ఆసిఫాబాద్‌ పట్టణంలోని కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు అజ్మీరాశ్యాంనాయక్‌, బాలేష్‌గౌడ్‌, రజాక్‌ తదితరులు పాల్గొన్నారు.

వాంకిడి/కౌటాల: మండలకేంద్రాల్లో కాంగ్రెస్‌ నాయకులు వైఎస్‌ రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వాంకిడిలో జరిగిన కార్యక్రమంలో నాయకులు నారాయణ, సుధాకర్‌, ప్రశాంత్‌, అనిల్‌, గణేష్‌, దాదాజీ, రమేష్‌, సంతోష్‌, కౌటాలలో నాయకులు రాజేశ్వర్‌, స్వామి, లక్ష్మణ్‌గౌడ్‌, కైలాస్‌, సురేష్‌, సంధ్య, పాండురంగ్‌ తదితరులు పాల్గొన్నారు.



వాంకిడిలో నివాళులు అర్పిస్తున్న నాయకులు

చెరువులను తలపిస్తున్న వీధులు

ఆసిఫాబాద్‌ రూరల్‌, జూలై 8: చిన్నపాటి వర్షానికే జిల్లా కేంద్రంలోని పలుకాలనీలు చెరువులను తలపిస్తున్నాయి. సోమవారం కురిసిన వర్షానికి జిల్లాకేంద్రంలోని కస్బావాడీ రహదారికి ఇరువైపులా డ్రైనేజీ లేకపోవడంతో వర్షపునీరు కాలనీలోకి చేరి చెరువును తలపించింది. కాలనీలో కొందరు అక్రమ కట్టడాలు నిర్మించడంతో ఈ సమస్య తలెత్తుతోందని పలువురు ఆరోపిస్తున్నారు. కాలనీలో నీరు నిలువ ఉండటంతో చిన్నపిల్లలు, వృద్ధులు నడవాలం టేనే భయపడు తున్నారు. జిల్లాఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.


చెరువును తలపిస్తున్న కస్బావాడీ వీధి

భారీ వర్షం.. ఉప్పొంగిన వాగులు

ఆసిఫాబాద్‌రూరల్‌, జూలై 8: ఆసిఫాబాద్‌ మండలంలో సోమవారం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం నుంచి ప్రారంభమైన వర్షం సాయంత్రం వరకు కురుస్తూనే ఉంది. దీంతో మండలంలోని వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. కుమరం భీం ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి చేరడంతో పెద్దవాగు పరివాహక ప్రాంతప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇంజనీరింగ్‌ అధికారులు సూచించారు. ఏ క్షణమైనా గేట్లు ఎత్తే అవకాశం ఉన్నందున పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. మండలంలోని గోవింద్‌పూర్‌ గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో పలువురి ఇళ్లలోకి వరద నీరుచేరడంతో ఇబ్బందులు పడ్డారు. గ్రామంలో పెరుగు తానూబాయి, ట్రాంజీ, రాఘుజీ తదితర ఇళ్లలోకి వరదనీరు వచ్చి చేరింది. వరదనీటిని ఎత్తి పోయడానికి వారు నానా కష్టాలు పడ్డారు. డ్రైనేజీ వ్యవస్థ నిర్మించాలని అధికారులకు విన్నవించినప్పటికీ నిర్మించడం లేదని వాపోతున్నారు.

కాగజ్‌నగర్‌: కాగజ్‌నగర్‌ పట్టణంలో సోమవారం సాయంత్రం వర్షం కురిసింది. దీంతో పట్టణంలోని లోతట్టుప్రాంతాల్లోకి నీరు చేరింది. పలు కాలనీలు బురదమయంగా మారడంతో పట్టణవాసులు ఇబ్బందులు పడ్డారు.

ఉప్పొంగి ప్రవహించిన కేరి(బి) వాగు

కెరమెరి: మండలకేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో సోమవారం కురిసిన భారీ వర్షానికి ఒర్రెలు, వాగులు ఉప్పొంగి ప్రవహించాయి. కేరి(బి), సాంగ్వి గ్రామాల మధ్య ఉన్న లోలెవల్‌ వంతెన పై నుంచి వరదనీరు పొంగడంతో ఇందాపూర్‌, మహా రాష్ట్రలోని జివితి ప్రాంతం నుంచి కెరమెరి వైపు వచ్చే వాహనాలు సుమారు రెండు గంటలపాటు వంతెన వద్దే నిలిచిపోయాయి. అక్కాపూర్‌, కరంజివాడ, జక్కాపూర్‌, శంకర్‌లొద్ది తదితర గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

లింగాపూర్‌: లింగాపూర్‌ మండలంలో సోమవారం భారీ వర్షం కురిసింది. మండలంలోని మామిడి పల్లి, లొద్దిగూడ, మోతి పటార్‌, కొత్తపల్లి, పట్కల్‌గూడ, వంక మద్ది, కంచన్‌పల్లి, పిట్ట గూడ వాగులు ఉప్పొంగి ప్రవహించాయి. దీంతో రెండు గంటలపాటు ప్రజలకు రాకపోకలకు అంతరాయం కలిగింది. మండలకేంద్రంలో రాజేష్‌ అంబాజీ ఇంట్లో వరదనీరు చేరడంతో నిత్యావసర సరుకులు తడిసిపోయాయి.

జైనూర్‌: మండలకేంద్రంతోపాటు గ్రామాల్లో సోమవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. చెరువులు, బావుల్లో నీరు వచ్చి చేరిందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వర్షంతో అంతర్గత రోడ్లు బురదమయంగా మారాయి. పిల్లలు, పెద్దలు నడవడానికి ఇబ్బందులుపడ్డారు. ఈ వర్షం పంటలకు ఎంతో ఉపయోగపడుతుందని రైతులు పేర్కొంటున్నారు.


ఉప్పొంగి ప్రవహిస్తున్న లింగాపూర్‌ మండలంలోని పట్టిగూడ వాగు


లింగాపూర్‌ మండలంలో ఉప్పొంగి ప్రవహిస్తున్న మోతిపటార్‌ వాగు


ఆసిఫాబాద్‌ పట్టణంలోని గోవింద్‌పూర్‌లో ఇళ్లలో చేరిన వరద నీరు


సిర్పూర్‌(టి) మండల కేంద్రంలో చెరువును తలపిస్తున్న జడ్పీ పాఠశాల ఆవరణ

శభాష్‌.. కుమార్‌

● గుంతను మట్టితో పూడ్చిన యువకుడు

● విద్యార్థులు, భక్తులకు తీరిన కష్టాలు

కాగజ్‌నగర్‌, జూలై 8: కాగజ్‌నగర్‌ బజార్‌ఘాట్‌ చౌరస్తాలో వర్షానికి గుంత ఏర్పడింది. ఈ గుంత సమీపంలోనే ఆలయం, పాఠశాల, మసీదు ఉండ టంతో భక్తులు, విద్యార్థులు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని గమనించిన సుభాష్‌కాలనీకి చెందిన కుమార్‌ సోమవారం సాయంత్రం తన సొంత ట్రాలీ ఆటోలో మట్టిని తెచ్చి గుంతను పూడ్చాడు. ఇప్పటికే ఐదు ట్రిప్పుల మట్టిని వేసినట్టు వివరించాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షానికి ఇక్కడి గుంతలో నీరు నిండి ఇబ్బందిగా తయారవుతోంది. దీంతో విద్యార్థులు, భక్తులు ఇబ్బం దులు పడుతున్నట్టు వివరించాడు. తనకు ఉన్న ట్రాలీ ఆటోతో మట్టిని నింపుకొని గుంతలో వేసినట్టు వివరించారు. సమస్యను పరిష్కరించడంతో చాలా సంతోషంగా ఉందన్నారు.


గుంతలో మట్టిని నేర్పుతున్న కుమార్‌





ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి

దహెగాం, జూలై 8: మండల ప్రజలు ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్‌ కవిత అన్నారు. సోమవారం మండలతహసీల్దార్‌ కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించారు. భూసమస్యలు, పెన్షన్‌, తాగునీరు తదితర సమస్యలపై దరఖాస్తులు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేందర్‌, ఏఈఓసంతోష్‌, ఏపీఎం చంద్రశేఖర్‌, ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్‌ అనసూర్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌ బుక్కులు, పెన్నులు

దహెగాం, జూలై 8: మండలంలోని మర్రిపల్లిప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు సోమవారం షఫ్యాల మల్లక్క చారిటబుల్‌ ట్రస్ట్‌ ఆధ్వర్యంలో పెన్నులు, నోట్‌బుక్‌ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్సై రాజు, టీజీబీ మేనేజర్‌ నవీన్‌కుమార్‌, ట్రస్ట్‌ అధ్యక్షుడు శ్రీనివాస్‌, శంకర్‌, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

తునికాకు డబ్బులు చెల్లించాలని నిరసన

చింతలమానేపల్లి, జూలై 8: మండలంలోని డబ్బా గ్రామస్థులు సోమవారం తునికాకు రాయల్టీ డబ్బులు చెల్లించాలని రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. తునికాకు కోసి నాలుగునెలలు గడుస్తున్నా డబ్బులు రాకపోవడంతో నిరసన చేస్తున్నట్లు తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించిడబ్బులు చెల్లించాలని కోరారు.

కుట్టు మిషన్‌ అందజేత

చింతలమానేపల్లి, జూలై 8: మండల కేంద్రానికి చెందిన వనిత అనే నిరుపేద మహిళకు ఎస్సై నరేష్‌ పోలీసుస్టేషన్‌లో సోమవారం కుట్టుమిషన్‌ అందజేశారు. మహిళలు ఆర్థికంగా ఎదగాలన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

జైపూర్, జూలై 8: ప్రతీ ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో సత్యనారాయణ పేర్కొన్నారు. సోమవారం టేకుమట్ల అంగన్‌వాడీ కేంద్రం, ప్రభుత్వ పాఠశాలతోపాటు గ్రామంలోని డ్రైనేజీలు, బోర్‌వెల్స్‌ను, సింగరేణి క్యాంటీన్‌ను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, డ్రైనేజీల్లో పూడికలు తీసివేయాలని కార్యదర్శికి సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సమయానికి తెరవాలన్నారు. ఏఈ విద్యాసాగర్, ఇన్‌చార్జి ఎంపీవో శ్రీపతి బాపు పాల్గొన్నారు.

గల్లీకో ఎమ్మెల్యేతో ప్రజల ఇబ్బందులు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

బెల్లంపల్లి, జూలై 8: బెల్లంపల్లి నియోజకవర్గంలో గల్లీకో ఎమ్మెల్యేతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. సోమవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గడ్డం వినోద్ ఎమ్మెల్యేగా గెలిచాక స్థానికంగా ఉండకుండా హైద్రాబాద్‌కే పరిమితమయ్యాడని, దీంతో గల్లీకో ఎమ్మెల్యే పుట్టుకొస్తున్నాడని ఆరోపించారు. ఎన్నికల్లో గెలిచాక స్థానికంగా ఉంటానని ప్రమాణం చేసి మాట తప్పాడన్నారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మాట నిలబెట్టుకోలేదన్నారు. పదవీ కాలం పూర్తి చేసుకున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీలను సన్మానించారు. స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలుపు ఖాయమన్నారు. నాయకులు సత్యనారాయణ, బానయ్య, బడికెల శ్రావణ్ పాల్గొన్నారు.

పేదలకు న్యాయం జరిగేలా చూడాలి



ఏజీపీ సత్యంను సన్మానిస్తున్న నాయకులు

లక్సెట్టిపేటరూరల్, జూలై 8: చట్ట ప్రకారం పేదలకు న్యాయం జరిగేలా చూడాలని అంబేద్కర్ యువజన సంఘం పట్టణాధ్యక్షుడు తొగరు రాజు కోరారు. లక్సెట్టిపేట జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఏజీపీగా ఎన్నికైన వేల్పుల సత్యంను సోమవారం సన్మానించారు. ఆయన మాట్లాడుతూ నిరుపేద కుటుంబంలో పుట్టి మారుమూల గ్రామం బలరావుపేట నుంచి ఉస్మానియా యూనివర్శిటీలో ఎల్ఎల్‌బీ పూర్తి చేశారన్నారు. సత్యం ఏజీపీగా ఎన్నిక కావడం గొప్ప విషయమన్నారు. మాజీ జెడ్పీటీసీ ముత్తె సత్తన్న, నాయకులు మల్లేష్, శ్రీకర్, గణపతి, ఓదన్న, సత్తయ్యలు ఏజీపీని సన్మానించారు. లచ్చన్న, రవి, నర్సయ్య, పురుషోత్తం, శ్రీధర్ పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి కృషి

బెల్లంపల్లి, జూలై 8: విద్యుత్ వినియోగదారులకు సమస్యలుంటే ఆన్‌లైన్ పోర్టల్‌లో తెలియజేయాలని ఎస్ఈ శ్రావణ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సమస్యలుంటే www.tgnpdcl.com లో తెలియజేయాలని సూచించారు. ఈ ఆన్‌లైన్ పోర్టల్‌లో ఏ సమయంలోనైనా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఎవరైనా విద్యుత్ బిల్లులు ఆన్‌లైన్‌లో చెల్లించాలనుకుంటే టీజీఎన్‌పీడీసీఎల్ యాప్‌ను ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసుకోవాలని సూచించారు.

దేశ భక్తి పేరుతో సంపద లూటీ



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 8: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశ భక్తి పేరుతో సంపదను లూటీ చేస్తోందని ఐఎఫ్‌టీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ కార్యాలయంలో నిర్వహించిన ఐఎఫ్‌టీయూ సమావేశంలో మట్లాడారు. మూడోసారి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం బొగ్గు గనులను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించేందుకు కుట్రలు చేస్తుందన్నారు. సింగరేణి సంస్థకు గనులను కేటాయించకుండా కేంద్రం కుట్రలు చేస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గనులను సింగరేణికి దక్కేలా పోరాడాలని పేర్కొన్నారు. విప్లవ కార్మిక సంఘాల ఐక్యవేదిక నిర్వహించే పోరాటంలో సింగరేణి కార్మికవర్గం విజయవంతం చేయాలని కోరారు. అనంతరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణ మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం ప్రమాదాలు జరిగినప్పుడు ఎల్లోకార్డు, రెడ్‌కార్డు పేరిట కార్మికులను భయభ్రాంతులకు గురి చేస్తుందని, ఈ సర్క్యులర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నరేష్, శ్రీనివాస్, అశోక్, నాగేశ్వర్‌రావు, మల్లేష్, జాఫర్, శంకర్, బ్రహ్మానందం, సంతోష్, కొమురయ్య, వెంకన్న, మొండయ్య పాల్గొన్నారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీల దీక్షలు

నస్పూర్, జూలై 8 : అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్‌ల హక్కుల సాధనకు సీఐటీయు ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్ష సోమవారం రెండో రోజుకు చేరింది. రిటైర్మెంట్ బెనిఫిట్స్ టీచర్లకు 2లక్షలు, హెల్పర్లకు లక్ష చొప్పున చెల్లించాలని తదితర డిమాండ్లతో దీక్షలో కూర్చున్నారు. దీక్షకు ఐకేపీ వీవోఏలు, పశుమిత్ర సంఘాలు మద్దతు తెలిపాయి. సీఐటీయు జిల్లా కార్యదర్శి రంజిత్ కుమార్, వివిధ సంఘాల నాయకులు కుమార్, సమ్మయ్య, భీంసేన్, సరోజ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకునేందుకే పల్లె నిద్ర


బెల్లంపల్లి(తాండూర్), జూలై 8: సమస్యలు తెలుసుకునేందుకే పల్లె నిద్ర కార్యక్రమం చేపడుతున్నట్లు మాదారం ఎస్ఐ రాములు తెలిపారు. ఆదివారం రాత్రి నర్సాపూర్‌లో పల్లె నిద్ర చేపట్టారు. ఎస్ఐ మాట్లాడుతూ ప్రజలు మూఢనమ్మకాలను నమ్మవద్దని, అనారోగ్యంగా ఉంటే ఆసుపత్రులకు వెళ్లాలన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి శ్రద్ధగా చదువుకోవాలన్నారు. ప్రజలకు ఏమైనా సమస్యలుంటే డయల్ 100కు ఫోన్ చేయాలన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. తాండూర్ ఎస్ఐ కిరణ్, పంచాయతీ కార్యదర్శి సాహెదుల్లా, పోలీసులు పాల్గొన్నారు.

అటవీ అధికారుల వేధింపులు ఆపాలి



డీఎఫ్‌వోకు వినతి పత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

చెన్నూరు, జూలై 8: కోటపల్లి మండలంలోని సుమారు 16 గ్రామాల పోడు రైతులను అటవీ అధికారులు వేధింపులకు గురి చేస్తున్నారని, వేధింపులు ఆపాలని సోమవారం చెన్నూరు డీఎఫ్‌వోకు బీజేపీ పెద్దపల్లి పార్లమెంట్ కన్వీనర్ వెంకటేశ్వర్‌గౌడ్, మండల అధ్యక్షుడు మంత్రి రామయ్యలు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ రైతులు వ్యవసాయం చేసుకోకుండా అటవీ అధికారులు అడ్డుకుంటున్నారని ఇది సరైంది కాదన్నారు. వ్యవసాయమే ఆధారంగా బతుకున్న రైతులను ఇబ్బందులకు గురి చేయడం సరైంది కాదన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మంత్రి సురేఖ, నాయకులు తిరుపతి, వెంకటనర్సయ్య, పోడు రైతులు పాల్గొన్నారు.



- భూములిచ్చేందుకు రైతులు ససేమిరా
- నామమాత్రపు ధరకు భూ సేకరణ
- ఎన్‌హెచ్ అధికారుల తీరుపై ఆగ్రహం
- మంచిర్యాల-వరంగల్ హైవే బాధితుల ఆందోళన
- వాస్తవ ధర చెల్లించాలని డిమాండ్

మంచిర్యాల-వరంగల్ మధ్య జాతీయ రహదారి నిర్మాణానికి ప్రతిపాదించారు. ఇందులో భాగంగా జైపూర్ మండలం నర్వా నుంచి గోపాల్‌పూర్ వరకు గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణం చేపట్టనున్నారు. అయితే ఈ గ్రామాల మధ్య సుమారు 110 హెక్టార్ల భూ సేకరణ చేపట్టాల్సి ఉంది. నామమాత్రపు పరిహారం చెల్లిస్తామని అధికారులు పేర్కొంటుండగా మార్కెట్ ధర చెల్లించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

అరకొర పరిహారం

మంచిర్యాల, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల-వరంగల్ జాతీయ రహదారి నిర్మాణంలో పోతున్న భూములకు అరకొర పరిహారం చెల్లింపుపై రైతులు ఆందోళనకు గురవుతున్నారు. వాస్తవ ధరలు చెల్లిస్తేనే భూములు ఇస్తామని చెబుతున్నారు. ఈ విషయమై గతంలో జైపూర్ మండలం శెట్‌పల్లిలో ఏర్పాటు చేసిన ప్రజాభిప్రాయ సేకరణలో బాధిత రైతులు ఈ అంశాన్ని లేవనెత్తారు. అయినా పట్టించుకోకుండానే భూ సేకరణకు చేపడుతుండడంతో రైతులు ఆందోళనకు సిద్ధపడుతున్నారు.

నామమాత్రపు పరిహారంతోనే సరి....

మంచిర్యాల-వరంగల్ జాతీయ రహదారి 163 కింద భూములు కోల్పోతున్న రైతులకు నామమాత్రపు పరిహారం చెల్లించేందుకు రంగం సిద్ధమైంది. జాతీయ రహదారి నిర్మాణం జరిగితే ఆ ప్రాంతం అభివృద్ధి చెంది, భూములకు మంచి విలువ వస్తుందని ఆశపడ్డ రైతులకు ఎన్‌హెచ్ అధికారులు మొండి చేయి చూపారు. నాగపూర్-విజయవాడ ఎకానమిక్ కారిడార్‌లో భాగంగా మంచిర్యాల-వరంగల్ గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారిని ఏర్పాటు చేస్తున్నారు. రూట్ మ్యాప్ ప్రకారం జిల్లాలోని జైపూర్ మండలం ఇందారం గ్రామ శివారులోని నర్వా నుంచి పౌనూర్ గ్రామంలోని గోపాల్‌పూర్ వరకు గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణం చేపట్టనున్నారు. జిల్లాలో మొత్తం 14 గ్రామాల మీదుగా 23.097 కిలోమీటర్ల మేర రహదారి నిర్మాణం జరుగుతుండగా సుమారు 110 హెక్టార్ల భూములు అవసరమవుతాయి. రహదారి కింద పోతున్న భూముల ధరలు వాస్తవంగా బహిరంగా మార్కెట్ రేట్ ప్రకారం ఎకరాకు రూ.40 లక్షల మేర పలుకుతున్నాయి. అయితే అధికారులు రూ.4 నుంచి 7 లక్షల వరకే ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

న్యాయమైన ధర చెల్లించాలి

జాతీయ రహదారి కింద పోతున్న భూములకు బహిరంగా మార్కెట్



కలెక్టర్‌కు విన్నవిస్తున్న బాధిత రైతులు (ఫైల్)

విలువ ఆధారంగా న్యాయమైన ధరలు చెల్లించాలని ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బాధిత రైతులు లేఖలు రాశారు. రహదారి కోసం భూములు ఇచ్చి, తద్వారా అందుకునే పరిహారంతో గుంట భూమి కూడా కొనలేమని, అన్నం పెట్టే పొలాలను తీసుకోవద్దంటూ మే నెలలో ప్రభుత్వాలకు లేఖలు పంపారు. ఇటీవల కలెక్టర్ కుమార్ దీపక్ ను సైతం కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో భూ సేకరణ జరపాల్సి వస్తే వాస్తవ రేటు చెల్లించాలని కోరారు. లేనిపక్షంలో భూములు ఇచ్చే ప్రసక్తేలేదని తేల్చి చెప్పారు. మరోవైపు సుందిళ్ల ప్రాజెక్టు నిర్మాణంతో మండలంలోని పలు గ్రామాల్లో వ్యవసాయం అభివృద్ధి చెందింది. ఈ క్రమంలో అతి తక్కువ పరిహారం చెల్లిస్తే భూములిచ్చేందుకు రైతులు ససేమిరా అంటున్నారు.

ఎనిమిదేళ్ల కిత్రం రూ.8 లక్షలు చెల్లింపు...

కాళేశ్వరం ప్రాజెక్టుల సముదాయంలో భాగంగా గోదావరిపై నిర్మించిన సుందిళ్ల బ్యారేజీ నిర్మాణం కోసం జైపూర్ మండలంలోని పలు గ్రామాల్లో రైతులకు చెందిన భూములను ప్రభుత్వం సేకరించింది. ఇందుకుగాను 2015-16లోనే ఎకరాకు రూ.8లక్షలు పరిహారం చెల్లించినట్లు రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం జాతీయ రహదారి భూములకు అందులో సగం చెల్లిస్తుండటంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎనిమిదేళ్ల కాలంలో భూముల ధరలు దాదాపు రెట్టింపయ్యాయని, అప్పట్లో చెల్లించిన దానికంటే అధికంగా ఇవ్వాల్సింది పోయి, తగ్గించడంపై ఆందోళనకు సిద్ధపడుతున్నారు.

నామమాత్రపు ధరకు భూమివ్వం

: కృష్ణమూర్తి, కుందారం



ప్రభుత్వం ప్రకటించిన విధంగా నామమాత్రపు ధర చెల్లిస్తే భూములు ఇచ్చే ప్రసక్తేలేదు. రహదారి కింద కోల్పోతున్న భూముల ధరలు ఎకరాకు రూ.50 లక్షలు పై చిలుకు పలుకుతున్నాయి. అధికారులు ఎకరాకు రూ. 4.30 లక్షలు ఇస్తామని నోటీసులు పంపించారు. ఎనిమిదేళ్ల కిత్రం సుందిళ్ల బ్యారేజీకి సేకరించిన భూములకు రూ.8 లక్షలు అందజేశారు. ఇప్పుడేమో తగ్గిస్తామంటున్నారు.

ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు



దరఖాస్తులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్, ఫిర్యాదు అందిస్తున్న 108 అంబులెన్స్ సిబ్బంది

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 8: ప్రజావాణిలో అందిన దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకొంటామని అదనపు కలెక్టర్ మోతిలాల్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ, డీఆర్‌డీవో కిషన్‌లతో కలిసి అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. లక్సెట్టిపేట, భీమారం, బెల్లంపల్లి, హాజీపూర్, కాసిపేట తదితర ప్రాంతాల నుంచి ప్రజలు దరఖాస్తులను అందజేశారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో 54 దరఖాస్తులు అందాయని, దరఖాస్తులను పరిశీలించి అధికారుల సమన్వయంతో పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వేమనపల్లి: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో అనిల్ కుమార్ ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. తహసీల్దార్ రమేష్, పశువైద్యాధి కారి అరుణ, ఏపీవో సత్యప్రసాద్, ఎంబీసీ కోఆర్డినేటర్ సుజాత, సీసీ శివరాం, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

జన్నారం: ఎంపీడీవో శశికళ, తహసీల్దార్ రాజ మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రజలకు సమస్యలుంటే దరఖాస్తులు అందజేస్తే వాటిని పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. ఈవోపీఆర్‌డీ రమేష్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

భీమారం: ఎంపీడీవో కార్యాలయంలో మండల పంచాయతీ అధికారి శ్రీపతి బాపురావు ఆధ్వర్యంలో ప్రజావాణి నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఏమైనా సమస్యలుంటే ప్రజావాణిలో దరఖాస్తులు అందజేస్తే పరిష్కరిస్తామన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి విద్యాసాగర్, త్రయంబకేశ్వర్, అధికారులు పాల్గొన్నారు.

పశువుల ఇబ్బందులు తొలగించాలి

కోటపల్లి: మండల కేంద్రంతో పాటు మల్లంపేట, ఏదులబంధం గ్రామాల్లో రోడ్లపైనే పశువులు ఉండడంతో 108 అంబులెన్స్ నడపడం కష్టంగా మారుతుందని, సమస్యను పరిష్కరించాలని 108 అంబులెన్స్ సిబ్బంది ప్రజావాణిలో ఎంపీవో సత్యనారాయణకు ఫిర్యాదు చేశారు. రాత్రి సమయంలో పశువులు రోడ్లపైనే ఉండడంతో అంబులెన్స్‌లను ఆపి పశువులను పక్కకు తరలించి వాహనాన్ని ముందుకు నడిపించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని, సమయం వృథా అవుతుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. అధికారులు దృష్టి సారించి రోడ్లపై పశువులు లేకుండా చర్యలు చేపట్టాలని కోరారు.

జాతీయ రహదారి అలైన్‌మెంట్‌ను పునఃసమీక్షించాలి



ఎన్‌హెచ్‌ఏఐ అధికారికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 8: ఆర్మూర్ నుంచి మంచిర్యాల మధ్య తలపెట్టిన ఎన్‌హెచ్ 63 జాతీయ రహదారి పనుల్లో భాగంగా లక్సెట్టిపేట నుంచి ముల్కల్ల వరకు జాతీయ రహదారి కోసం ఖరారు చేసిన అలైన్‌మెంట్‌ను పునఃసమీక్షించాలని మాజీ ఎంపీ బోర్లకుంట వెంకటేష్ నేత, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్‌లు సోమవారం హైద్రాబాద్‌లో ఎన్‌హెచ్‌ఏఐ రీజనల్ ఆఫీసర్ రజాక్‌కు వినతిపత్రం అందించారు. ఈ గ్రామాల ప్రజలు గతంలో ఎల్లంపల్లి ప్రాజెక్టులో భూములు కోల్పోయిన విషయాన్ని దృష్టిలో ఉంచుకుని విస్తరణ చేపట్టాలన్నారు.

గిరిజనుల సంక్షేమానికి కృషి

గిరిజన కార్పొరేషన్ చైర్మన్‌గా కోట్నాక తిరుపతి నియామకం



కట్నాక్ తిరుపతి

దండేపల్లి, జూలై 8: ఆదివాసి గిరిజనుల సంక్షేమానికి కృషి చేస్తానని రాష్ట్ర గిరిజన కార్పొరేషన్ చైర్మన్ కొట్నాక తిరుపతి అన్నారు. దండేపల్లి మండలం ఆల్లీపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని మొకాసిగూడకు చెందిన తిరుపతిని రాష్ట్ర గిరిజన కార్పొరేషన్ చైర్మన్‌గా నియమిస్తూ సోమవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాల అమలు కమిటీ మెంబర్‌గా తిరుపతి పని చేస్తున్నారు. 2021లో ఇంద్రవెల్లి అమరవీరుల స్తూపం వద్ద నిర్వహించిన దళిత గిరిజన దండోరా మహాసభను విజయవంతం చేయడంలో క్రియాశీలకంగా పనిచేశారు. రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో పాదయాత్రలో తిరుపతి పాల్గొన్నారు. మాజీ పార్లమెంట్ సభ్యురాలు శ్రీమీనాక్షి నటరాజన్ భూదాన్ పోచంపల్లి నుంచి మహారాష్ట్ర వరకు చేపట్టిన పాదయాత్రలో పాల్గొన్నాడు. భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్‌మార్చ్ ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు కొనసాగిన పాదయాత్రలో పాలుపంచుకున్నాడు. రాష్ట్ర ప్రభుత్వం అతని సేవలను గుర్తించి గిరిజన కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించడంపై ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల ఆదివాసి గిరిజన సంఘాల నాయకులు, మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వైద్య శిబిరాలను నిర్వహించాలి

కాసిపేట, జూలై 8 : వర్షాకాలం దృష్ట్యా ఆదివాసీ గిరిజన గూడాల్లో వైద్య శిబిరాలను నిర్వహించాలని సోమవారం గిరిజన సంఘాల నాయకులు ప్రజావాణిలో ఎంపీడీవో సత్యనారాయణసింగ్‌కు వినతి పత్రం అందించారు. తుడుందెబ్బ మండల గౌరవాధ్యక్షుడు ఆత్రం జంగు మాట్లాడుతూ ఆదివాసీ గిరిజన గూడాల్లో ప్రజలు జ్వరాల బారిన పడి అవస్థలు పడుతున్నారన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం లోపించిందని దీంతో దోమలు, ఈగలు వృద్ధి చెంది జ్వరాల బారిన పడుతున్నారన్నారు. వెంటనే వైద్య శిబిరాలను నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మడావి శంకర్, కోవ లింగు, భీంరావు, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై నిరాధార ఆరోపణలు మానుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

మంచిర్యాల అర్బన్, జూలై 8: మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావుపై మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు నిరాధార ఆరోపణలు మానుకోవాలని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. సోమవారం ఎమ్మెల్యే నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి, పట్టణ అధ్యక్షుడు తూముల నరేష్, మహిళా విభాగం అధ్యక్షురాలు హేమలత మాట్లాడారు. ప్రజలు దివాకర్‌రావును ఎన్నికల్లో ఓడించినా బుద్ధి రావడం లేదన్నారు. ఎమ్మెల్యేపై వెలువడిన లేఖలపై పోలీసులు విచారణ జరుపుతున్నారన్నారు. భూకబ్జాల కేసులో వారి ప్రధాన అనుచరుడు అరెస్టు అయ్యాడని గుర్తుచేశారు. గోదావరి ఒడ్డున మాతా శిశు ఆసుపత్రిని నిర్మించి కోట్ల రూపాయల ప్రజాధనం వృథా చేశాడన్నారు. అందరికి అందుబాటులో ఉండేలా ఐబీ ప్రాంతంలో ఆసుపత్రిని నిర్మించాలని ఎమ్మెల్యే చర్యలు తీసుకుంటుంటే దివాకర్ రావు అడ్డుకోవాలని చూస్తున్నాడని ఆరోపించారు. 20 యేండ్ల తన పాలనలో ఏ మేరకు అభివృద్ధి చేశారో నిరూపించాలని సవాల్ చేశారు. అధికారంలో లేకున్నా ప్రేంసాగర్‌రావు నియోజకవర్గ ప్రజలకు వారి ట్రస్టు ద్వారా సేవా కార్యక్రమాలు చేశారని, దివాకర్‌రావు లాగా ఎన్నికలు ముగిసిన వెంటనే ట్రస్టును ఎత్తివేయలేదన్నారు. మరోసారి ఎమ్మెల్యేపై నిరాధార ఆరోపణలు చేస్తే సహించమని హెచ్చరించారు. నాయకులు చిట్ల సత్యనారాయణ, రామగిరి బానేష్, బొలిశెట్టి కిషన్, అబ్దుల్ మాజీద్, తదితరులు పాల్గొన్నారు.

మా బాధలు పట్టించుకోండి

- కోనంపేట గ్రామస్థుల నిరసన
- హెల్త్ సబ్ సెంటర్‌కు తాళం



సబ్‌సెంటర్‌కు తాళం వేస్తున్న యువకులు

నెన్నెల, జూలై 8: కనీస సౌకర్యాలు లేక ఇక్కట్ల పాలవుతున్నామని కోనంపేట గ్రామస్థులు సోమవారం నిరసనకు దిగారు. విద్య, వైద్యం, రవాణా సౌకర్యాలు లేక పడరాని పాట్లు పడుతున్నామని, ఎన్ని సార్లు చెప్పిన ఎవరూ పట్టించుకోవడం లేదని రామటెంకి శ్రీనివాస్ పేర్కొన్నారు. వైద్య సిబ్బంది సక్రమంగా విధులకు హాజరుకాక పోవడంతో సబ్ సెంటర్‌కు తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. ఎంత చెప్పిన టీచర్లు, వైద్య సిబ్బంది పనితీరులో మార్పు రావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కుశ్నపల్లి వైపు బ్రిడ్జీలు నిర్మించి అప్రోచ్ రోడ్డు నిర్మించకపోవడంతో అవి నిరుపయోగంగా ఉన్నాయన్నారు. కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతుంటే అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదన్నారు. యూపీఎస్‌లో కొనసాగుతున్న జీపీ కార్యాలయాన్ని సొంత భవనంలోకి తరలించాలని కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. గ్రామస్థులతో నోడల్ అధికారి ప్రకాష్‌రావు సమావేశమయ్యారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని, టీచర్లు సక్రమంగా విధులకు హాజరయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు. వారం రోజుల్లోగా సమస్యలు పరిష్కారం కాకపోతే నిరాహార దీక్షలు చేపడతామని హెచ్చరించారు.

కస్తూర్బా పాఠశాల సమస్యలు పరిష్కరించాలి

కోటపల్లి, జూలై 8: కస్తూర్బా పాఠశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎస్ఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జుమ్మిడి గోపాల్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. పాఠశాలలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, బోరు ఏర్పాటు చేసినా మోటారు బిగించకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పాఠశాలలో ఇన్వర్టర్ లేకపోవడంతో రాత్రివేళ విద్యుత్ నిలిచిపోతే విష పురుగుల బారిన పడే అవకాశం ఉందన్నారు. అమ్మ ఆదర్శ పనులు ముందుకు సాగడం లేదన్నారు. పాఠశాల మరమ్మతుకు గతంలో రూ.15.5 లక్షలు మంజూరు చేయగా నిధులు సక్రమంగా వినియోగించలేదన్నారు. నిధుల దుర్వినియోగంపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

దుకాణాల కిరాయిలను తగ్గించాలి



చైర్మన్‌కు వినతిపత్రం ఇస్తున్న వ్యాపారులు

మంచిర్యాల అర్బన్, జూలై 8: మార్కెట్ వద్ద, మున్సిపల్ కాంప్లెక్స్‌లోని దుకాణాల కిరాయిలను తగ్గించాలని చైర్మన్ రావుల ఉప్పలయ్య, కమిషనర్ మారుతీప్రసాద్‌లకు సోమవారం దుకాణదారులు వినతిపత్రాలను అందజేశారు. పదేళ్ళుగా వ్యాపారాలను కొనసాగిస్తున్నామని, మున్సిపల్ శాఖ వారు ప్రతీ మూడు సంవత్సరాలకు ఒకసారి 33.33 శాతం కిరాయిలను పెంచుతున్నారని, తమపై తీవ్రమైన ఆర్థిక భారం పడుతుందని పేర్కొన్నారు. కరోనా సమయంలో లాక్‌డౌన్ కాలంలో అద్దె వసూలు చేయవద్దని ప్రభుత్వం తెలిపినా 2 శాతం వడ్డీతో కలిపి వసూలు చేస్తున్నారంటూ వారు ఆవేదన వ్యక్తం చేశారు. కరోనా సమయంలోని బకాయిలను రద్దు చేయడంతో పాటు ప్రస్తుతం ఉన్న కిరాయిలను తగ్గించాలని కోరారు. ఎండి.రఫిక్, షఫిక్, కలీం, తదితరులు ఉన్నారు.

వ్యాసరచన పోటీలు



విజేతలకు బహుమతులు అందిస్తున్న కన్వీనర్

చెన్నూరు, జూలై 8: ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం చెన్నూరు లోని శిశుమందిర్ పాఠశాలలో ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మండల స్థాయి వ్యాసరచన, ఉపన్యాస పోటీలను నిర్వహించారు. ఏబీవీపీ కరీంనగర్ విభాగ్ కళామంచ్ కన్వీనర్ మామిడి అక్షిత మాట్లాడుతూ విద్యార్థుల్లోని ప్రతిభను వెలికి తీసేందుకు పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. ఉపన్యాస పోటీల్లో రైసింగ్ సన్ పాఠశాలకు చెందిన హాసీని, వ్యాసరచన పోటీల్లో శిశుమందిర్ పాఠశాల విద్యార్థి శ్రీవిద్య మొదటి బహుమతి సాధించారు. రత్న లక్ష్మీనారాయణ, బొడ్డు మహేందర్, జగన్‌మోహిని, ఏబీవీపీ నాయకులు సతీష్, మోసెస్, శివ, సాగర్, శ్రావణ్, మహేందర్ పాల్గొన్నారు.